


# జి.నారాయణరావు



## 'అ ఆ' లు నేర్పిన గురుదేవులకి అక్షరాంజలి

అది 1981 సంవత్సరం అప్పుడు గాంధీ హాస్పటల్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు ఆనుకుని ఉండేది. ఇది జంట నగరాల్లో బోధనా ఆసుపత్రులలో ఒకటి. చుట్టుపక్కల వున్న అన్ని జిల్లాలనుండీ, ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర జిల్లాలనుండి మాత్రమే కాక సరిహద్దున ఉన్న మహారాష్ట్ర ప్రాంతం నుండి కూడా ప్రజలు వస్తూ ఉంటారు. ఎప్పుడూ హాస్పటల్ జనాలతో కిటకిటలాడుతూ ఉంటుంది. ఇది ఒకకోణం. మరోకోణం ఏమిటంటే.. మిగిలిన గవర్నమెంటు ఆస్పత్రుల అవలక్షణాలన్నింటినీ ఇదికూడా పుణికిపుచ్చుకుని ఉండేది

పిడియాట్రిక్ వార్డ్, గైనకాలజీ డిపార్ట్‌మెంట్ పైన ఫ్లోర్‌లో ఉండేవి. పేషెంట్లు, వాళ్ళ బంధువులతో హడావిడిగా ఉంటుంది. అప్పట్లో ఒకరోజు విపరీతమైన బిజీగా ఉండే ఔట్ పేషెంటును చూసి వార్డ్ రౌండ్స్ కొరకు నేను, నా సహోద్యోగులు వచ్చాము. నేను అప్పుడు పిడియాట్రిక్స్‌లో పోస్ట్‌గ్రాడ్యేషన్ చేస్తున్నాను. ఆరోజుల్లో కారిడార్‌లోనే ఎమర్జన్సీ పేషెంటును చూడవలసి వస్తూ ఉండేది. ఆ రోజు కారిడార్‌లోని స్ట్రెచర్ మీద పది, పదకొండు సంవత్సరాల వయసున్న ఒక అబ్బాయి అపస్మారక స్థితిలోఉన్నాడు. వాళ్ళు సికింద్రాబాద్‌లోని మహంకాళి ఆలయం సమీపంలో ఉంటారు. పెద్దగా ఏమీ వివరాలు ఇవ్వలేకపోతున్నారు తల్లితండ్రులు. అప్పటికే అన్ని పరీక్షలు చేయబడి ఉన్నాయి. కానీ అన్నీ నార్మల్‌గా వున్నాయి. అపస్మారక స్థితికి కారణం తెలియడం లేదు. అప్పుడు మా ప్రొఫెసర్ డాక్టర్ మూర్తిగారు వచ్చారు. క్షుణ్ణంగా పరీక్ష చేసారు. అంతా చేసినా కారణం తెలుసుకోవడం కష్టంగా ఉంది. వెంట్రుకులలో కొంత ఫంగల్ ఇన్ఫెక్షన్ ఉండటం ఆయన గమనించారు. అప్పుడు ఆయనకు కారణం స్ఫురించింది. కొంత మంది ఆర్.ఎం.పి వైద్యులు ఆ కాలంలో దీనిని ఆర్సెనికాతో ట్రీట్ చేస్తారు. Arsenic poisoning అయి ఉండచ్చు అని ఊహించారు. వెంటనే అది నిజమని పరిక్షలో తేలింది. బొంబాయి నుండీ bal అనే మందును తెప్పించి ట్రీట్ చేసారు. ఆ అబ్బాయి పూర్తిగా కోలుకున్నాడు. ఇటువంటి ఎన్నో క్లిష్టమైనకేసులను సునాయాసంగా పరిష్కరించగలిగారు, నాకు నచ్చిన మాష్టారు డాక్టర్. పి.ఎస్. మూర్తిగారు.

ఆదర్శమైన గురువుకు ఉండవలసిన అన్ని లక్షణాలు పుష్కలంగా ఆయనలో ఉండేవి. బోధనాశక్తి, బోధనా పటిమ, బోధనా చాతుర్యం, శ్రోతలను ఆకట్టుకునే భాష లాంటి అరుదైన గుణాలు ఉండడమే గాక, పరిశోధన చేద్దామనుకునేవారికి అత్యంత ప్రోత్సాహము చూపించేవారు. రోగుల పట్ల శ్రద్దకు మాత్రం ఎప్పుడూ పెద్ద పీట వేసేవారు. దీనిని క్రింది ఉదాహరణను పేర్కొనవచ్చు.

ఒకరోజు నాకు అనుకోకుండా మీటింగ్‌లో మాట్లాడటానికి ఒక టాపిక్ ఇచ్చారు. దానికి సమయాభావం వలన ఆరోజు పూర్తిగా ఈ విషయమై నేను బిజీగా ఉండిపోవలసి వచ్చింది. అంతా తయారయి మేము మీటింగ్‌లో కూర్చున్నాము. అప్పుడు తెలిసింది ER నుండి ట్రాన్సఫర్ అయి వచ్చిన ఒక పేషెంటును ఎవరూ ఇంకా చూడలేదని - దానికి ఆయన చాలా కోపం తెచ్చుకున్నారు. మీటింగును మాత్రమే కాకుండా ఆ వారం మొత్తం టీచింగ్ రౌండ్స్‌ను కాన్సిల్ చేసారు. మేమందరం నిరుత్సాహానికి గురి అయినా జీవితంలో విలువైన

పాఠాలను ఆ విధంగా నేర్చుకున్నాము. రోగి మాత్రమే అతి ముఖ్యమైన వ్యక్తి, ట్రీట్‌మెంట్ అతిముఖ్యమైనది. మా పోస్ట్‌గ్రాడ్యేట్ స్టూడెంట్స్ అందరు 22 - 24 ఏండ్ల మధ్య ఉన్నారు. ఆ వయస్సులో పడ్డ జీవిత పాఠాలు జీవితాంతం గుర్తుండిపోతాయి. ఆ తరువాత ఏ పేషెంట్ కూడా ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం లేకపోయేది. మేము ఎంత బిజీగా ఉండేవాళ్ళమో చెప్పనవసరం లేదు అనుకుంటాను.

ప్రభుత్వ బోధనాసుపత్రులలో రోగులపట్ల నిర్లక్ష్యం, అవినీతి ఎటువంటి వారికయినా చెప్పకపోయినా కళ్ళకు కట్టినట్లు కనిపిస్తూ ఉంటుంది. అవినీతి వార్డుబాయ్ దగ్గర నుండీ మొదలవుతుంది అంటే చాలామంది ఆశ్చర్యపోతారు. చాలా మంది ప్రధాన వైద్యులు ట్రాన్స్‌ఫర్‌లను అడ్డుకుంటూ అదే హాస్పటల్లో ఉంటారు. వాళ్ళకు ప్రభుత్వం ఇచ్చే జీతం కంటే పైన వచ్చే ఆదాయం పదుల రెట్లలో ఉంటుంది. ప్రైవేట్ ప్రాక్టీసును అత్యంత ఉత్సాహంగా చేసుకుంటారు. టీచింగ్‌కు నామమాత్రం న్యాయం చేయరు. వాళ్ళ కిష్టమైన లేదా ప్రావీణ్యం ఉన్న ఏదో ఒక టాపిక్‌ను మాత్రమే పదేపదే వర్ణిస్తుంటారు. అందుకే మా మిత్రులకు ఏ టీచర్ ఏ టాపిక్ చెప్పినప్పుడు ఎక్కడెక్కడ జోక్‌లు వేస్తుంటారో బాగా తెలుసు. వాళ్ళు మా స్టూడెంట్స్ చదివే పుస్తకాలు మాత్రమే చదువుతారు. లేటెస్ట్ ఏమవుతుందో వాళ్ళు పట్టించుకోరు.

ఇటువంటి పరిస్థితుల్లో కూడా తను నమ్మిన విలువలకు గట్టిగా కట్టుబడి మనగలగడం సామాన్యం కాదు. అతడే మన డా.పి.ఎస్.మూర్తిగారు. అతను 5 అడుగుల ఎత్తుగల, కనిపించని ఆజానుబాహుడు. ఎప్పుడూ మంచి డ్రెస్, టై కట్టుకుని హుందాగా ఉండేవాడు. గవర్నమెంటు హాస్పటల్‌లో లంచాలు తినని, తిననివ్వని డాక్టర్లకు క్లాసు IV ఉద్యోగులు సరిగ్గా గౌరవం ఇవ్వరు. కానీ అతనిని అందరూ చాలా గౌరవించేవారు. వారి స్వగ్రామం భీమవరం అనుకుంటాను. హైదరాబాద్‌లో అరుదుగా లభించే స్వచ్ఛమైన తెలుగు భాష, తెలుగుతనం ఆయననుండీ వచ్చేది. వారి పర్సనల్ విషయాలు నాకు ఎక్కువగా తెలియవు. ఆయన వాడే కలర్స్ కొంచెం వింతగా అనిపించేవి. నాకు తెలిసిన చాలా మంది కంటే వారికి ఇంగ్లీషు మీద మంచి సాధికారం ఉంది. గవర్నమెంటు టీచింగ్ హాస్పటల్‌కు చాలా పేదవాళ్ళు, పల్లెటూరి నుండీ వచ్చినవాళ్ళు తెచ్చే పేషెంట్స్ చాలా సీరియస్‌గా ఉంటారు. ఈ పేషెంట్స్ వేరే వైద్యులు దగ్గర సరిగ్గా వైద్యం దొరకక కాంప్లికేట్ అయి ఉంటారు. పేషెంట్లకు కాని, వాళ్ళ బంధువులకు గానీ అనునయంగా సానుభూతిగా కన్పించదు. చేతులు చాపేవాళ్ళు కానివ్వండి, చీదరించుకునే వాళ్ళు కానివ్వండి అడుగడుగునా కనిపిస్తారు. అటువంటి పరిస్థితులలో ఎటువంటి మనుష్యులయినా, చినిగిన బట్టలతో ఉన్నా సరే వారిని మూర్తిగారు 'మీరు' అని గౌరవంగా సంబోధించేవారు. దీనివలన వాళ్ళు ఇబ్బంది ఫీలయ్యేవారు. అయినా మర్యాద ఇవ్వడం తగ్గించేవారు కాదు.. అటు వంటి వ్యక్తులు అతి అరుదుగా కనిపిస్తారు.

ఒకసారి వార్డ్‌లో ఉన్న ఇన్ పేషెంటుకు అందవలసిన మందులు అందలేదు. నర్స్‌ను ఈ విషయమై ఆయన అడిగారు. స్థూలకాయం ఉన్న తమిళ తెలుగు నర్స్ ఇంకా ఫార్మసీ నుండీ డిస్పాచ్ కాలేదు అని తాపీగా జవాబు ఇచ్చింది. మిగిలిన వాళ్ళు అయితే పట్టించుకునేవారు కాదేమో. ఆయన కొంత సమయం వెచ్చించి ఫార్మసీ ఎన్నింటికి సప్లై చేస్తుందని విచారించారు అప్పుడు తేలిందేమిటంటే ఆ మందులు అంతకు ముందే డిస్పాచ్ అయ్యాయని. అయితే ఏవి అని అడిగారు. అప్పుడు తెలిసింది ఆ మందులు నర్స్ కాజేసి తన ఫ్రెండుకు ఇచ్చిందని. ముచ్చెమటలు పట్టిన ఆ నర్స్ దాదాపు స్పృహ కోల్పోయినట్లయింది. తర్వాత అటువంటి సంఘటన ఆ ఫ్లోర్‌లో వినపడలేదు.

రోగిని దాదాపు 45 నిమిషాలు నుండీ ఒక గంట తీసుకుని క్షుణ్ణంగా పరీక్షించేవారు. ఆయన పేషెంట్లు, పేషెంట్ల బంధువుల నుండి వివరమైన సమాచారం రాబట్టేవారు. ముఖ్యంగా ఆయన పరీక్షించే విధానమే నేను ఆదర్శంగా స్వీకరించాను.

నాతో పాటు పి.జి చేసేవారిలో డా. విజయ్ భరద్వాజ్ ఉండేవాడు. (ఇప్పుడు అతను Michigan Henry ford Hospital పనిచేస్తున్నాడని విన్నాను.) మూర్తిగారి కారు గురించి ఒక జోక్ చెప్పాడు.

మూర్తిగారు ఆరెంజ్ రంగు గల ఫియట్ కారు వాడుతూ ఉండేవారు. మా పిడియాట్రిక్స్ డిపార్ట్‌మెంట్‌కు ఎదురుగా ఉన్న ఫ్యామిలీ ప్లానింగ్ వింగ్ గోడకు ఆనుకుని పార్క్‌చేసేవారు. దానిమీద రోజా పక్షులు విపరీతంగా రెట్ట వేసేవి.

విజయ్ ఒకరోజు "సార్! మీ కారు రంగంటే ఈ పక్షులందరికీ బాగా ఇష్టమనుకుంటాను" అన్నాడు.

"ఇష్టమే లేక అయిష్టం కూడా అనుకోవచ్చు" కదా అని దానిని స్పోర్టివ్‌గా తీసుకుని హుందాగా నవ్వారు. వారిలో సమయానుకూలంగా హ్యూమరస్‌గా మాట్లాడే శక్తి ఉంది. ఆయన విజయ నగర్ కాలనీలో ఇల్లు కట్టుకున్నప్పుడు మమ్మల్ని అందరినీ పిలిచి మంచి ఆతిధ్యము ఇచ్చారు.

నేను వేరే కారణాల వలన ఒక సంవత్సరం అయిన తర్వాత ఆ డిపార్ట్‌మెంట్ నుండీ మారాను. కానీ వారు నాకు చిరకాలం గుర్తుంటారు.



*నారాయణ రావుగారు గాంధీ మెడికల్ కాలేజీ నుండి ఉత్తీర్ణులయ్యారు. ఇప్పుడు మౌంట్ షష్టాలో ఇంటర్నల్ మెడిసిన్ ప్రాక్టీస్ చేస్తున్నారు.*

